క్లుప్తంగా

చిత్రలేఖనంలో రాణిస్తే గుర్తింపు



చిత్రలేఖనం శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, రచయిత సత్తిరాజు మాట్లాడుతూ చిన్నారులు చదువుతో పాటు ఆట పాటలు, క్రీడలు, చిత్రలేఖనంలో కూడా ప్రతిభ కనబరిచాలన్నారు. సెల్ ఫోన్ గేమ్స్‌కు యువత,చిన్నారులు ప్రభావితం కాకుండా భవిష్యత్తుకు ఉపకరించే వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. చిత్ర లేఖనంలో రాణిస్తే గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమం అనంతరం అక్కడ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ



ఉక్కు త్రిష్నా మైదానంలో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఉక్కునగరం త్రిష్నా మైదానంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి. పాండే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. స్టీల్‌ప్లాంట్ లక్షలాది మొక్కలు నాటి కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్నా మైదానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్, డాక్టర్ చెన్నా కిషోర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, పర్యావరణ విభాగం ఉద్యోగులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, బాపిరాజు, శ్రీనివాస్, ఎం.పెంటారావు, కొండబాబు పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్’ పోరాటానికి భెల్ సీఐటీయూ మద్దతు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 787వ రోజు జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపుతూ దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఆదివారం జరిగిన దీక్షా శిబిరంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన పోరాటానికి భెల్ సీఐటీయూ తరఫున, ఇతర ప్రభుత్వరంగ సంస్థల తరఫున పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భెల్ సీటు నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.పవన్ కుమార్, బి.కృష్ణమూర్తి, ఎస్.ప్రసాద్, రాజు, సత్యనారాయణ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల కార్మిక వర్గాల నాయకులు పాల్గొన్నారు.

తూర్పు కాపు నూతన జేఏసీ ఏర్పాటు

సీతమ్మధార : తూర్పు కాపు కులాన్ని చిన్నచూపు చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హెచ్చరించారు. ఆశీలమెట్టలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తూర్పు కాపు రిజర్వేషన్ల సాధనకు పలుమార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 36 మందితో తూర్పు కాపు జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలకు పరిష్కారం లేదా!



పూడికలు తొలగించని తుమ్మడపాలెం ప్రధాన గెడ్డ ఇలా...



గుంతల మయంగా మారిన సుభాష్‌నగర్ సీసీ రోడ్డు

- అధ్వానంగా కాలువలు, గెడ్డలు, రహదారులు
- సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు

కంచరపాలెం: నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి అధికారులు ఓ వైపు ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం పరిధిలోని సుభానగర్, గౌరీనగర్, శ్రీరామ్‌నగర్, తుమ్మడపాలెం, ఆశవానిపాలెం, శ్యామ్‌నగర్, భవానీగార్డెన్స్ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో ఆయా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం సమస్యలతో సహవాసం చేస్తున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

గుంతల మయం

ఆయా కాలనీల్లో మంచినీటి పైపులైన్ పనుల నిమిత్తం రహదారి మధ్యలో గోతులు తవ్వారు. పనులు పూర్తయినా గోతులను పూర్తిస్థాయిలో పూడ్చకుండా వదిలేశారు. దీంతో వర్షాలు పడుతున్న సమయంలో గోతుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వీధి రోడ్లు అలాగే ఉండడంతో పాదచారులు జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపిస్తుండడంతో కాలనీ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా డ్రైనేజీలు

వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. రహదారులకు ఆనుకుని ఉన్న కాలువలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగు సక్రమంగా ప్రవహించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. చెత్తాచెదారాలు తొలగించాల్సిన శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శ్యామ్‌నగర్ నుంచి తుమ్మడపాలెం , గౌరీనగర్, సుభాష్‌నగర్ వరకు రైల్వేట్రాక్ రహదారి ప్రధాన గెడ్డల్లో పందుల బెడద ఎక్కువ అయింది. పందుల సంచారంపై పబ్లిక్ హెల్త్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఆయా కాలనీల్లో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగడం లేదు. కాలం చెల్లిన విద్యుత్ తీగలతో భయాందోళన చెందుతున్నారు.

ఫిర్యాదు చేసినా ..

మా కాలనీలో సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడం లేదు. ఎంతో కాలం నుంచి కాలనీ రహదారులను తవ్వినా గోతులను నేటికీ పూడ్చలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం పడితే రోడ్లు మురుగుతో తాండం చేస్తున్నాయి.

– శరగడం రామారావు, భవానిగార్డెన్స్, ఐటీఐ జంక్షన్.

అధికారులు దృష్టి సారించాలి

మా కాలనీ సమస్యలపై జోన్–5 కమిషనర్, ఇతర అధికారులు దృష్టి సారించాలి. ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని వాటిపై స్పందించాలి. వార్డులో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి సమస్యలకు పరిష్కరం చూపాలి. కనీసం మౌలిక సదుపాయాలైన రహదారులు, డ్రైనేజీలు, గెడ్డలు, విద్యుత్ లైట్లపై దృష్టి సారించాలి.

– ఎం.నాగేశ్వరరావు, శ్యామ్‌నగర్, 104 ఏరియా.

సీఎం జగన్ పాలనలో దళితులకు మేలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున
- పెందుర్తిలో బీఆర్ అంబేడ్కర్ 132 జయంతి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

సింహాచలం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో దళితులకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక సేవకుడు దుంబూరి రామారావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అంబేడ్కర్ భావజాలంతో ముడిపడి ఉందన్నారు. చంద్రబాబు ఆలోచన అంబేడ్కర్ ఆలోచనా విధానానికి వ్యతిరేకమన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో దళితలపై దాడులు జరిగితే ఏనాడు పట్టించుకోలేదన్నారు. దళితులతో పాటు అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎలా మెలుగుతున్నారో తెలుసుకున్నారు. కొట్లాటలు, తగాదాల్లో తలదూర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో నందమూరి తారక రామారావు శంత జయంతి వేడుకలు టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గొడ్డిపాటి సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, యలమంచిలి ప్రసాద్, నరవ పైడిరాజు, బి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: తెలుగు వారి గుండె చప్పుడు నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) అని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్ అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 61వ వార్డు ఆర్‌కేపురంలోరి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

➡ మల్కాపురం బస్టాప్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాకి పోలిరెడ్డి,నూనెల శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

ఇవి తీసుకురావాలి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగు ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4–10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

ర్యాంకులవారీగా కౌన్సెలింగ్ వివరాలు:

కేంద్రం మే29 మే30 మే31
జూన్1 జూన్2 జూన్3 జూన్4
జూన్5

కెమికల్ ఇంజినీరింగు కాలేజీ, కంచర పాలెం

1నుంచి 6000 12001 నుంచి 19500
27001 నుంచి 35000 43001 నుంచి 51000
59001 నుంచి 67000 75001 నుంచి 83500
92001 నుంచి 100000 108001 నుంచి 116000

పాలిటెక్నిక్ కాలేజీ, కంచర పాలెం 6001 నుంచి 12000 19501 నుంచి 27000 35001 నుంచి 43000 51001 నుంచి 59000 67001 నుంచి 75000 83501 నుంచి 92000 100001 నుంచి 108000 116001 నుంచి చివరి ర్యాంకు

పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి

1 నుంచి 12000 12001 నుంచి 27000
27001 నుంచి 43000 43001 నుంచి 59000
59001 నుంచి 75000 75001 నుంచి 92000
92001 నుంచి 108000 108001 నుంచి చివరి ర్యాంకు

ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు జూన్ 2 నుంచి 5 వరకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలి.

కళ్లకు కట్టిన ఘంటసాల నాటకం

మద్దిలపాలెం: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితంలో ముఖ్య ఘట్టాలతో రూపొందించిన నాటకాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. రంగసాయి నాటకం సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటక ప్రదర్శనను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సురపనేని విజయకుమార్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకంలో ప్రధానంగా ఘంటసాల వెంకటేశ్వరరావు తొలినాళ్లలో సంగీతం నేర్చుకునే క్రమంలో పడిన కష్టాలను చూపించారు. అనంతరం విజయనగరం సంగీత కళాశాలకు చేరిన తీరుతో పాటు ఆయన వివాహం గురించి చక్కగా సన్నివేశాలు రూపొందించారు. అనంతరం మద్రాసు వెళ్లిన ఘంటసాల అక్కడ సంగీత దర్శకుడుగా, గాయకుడుగా ఎదిగిన తీరును నాటకంలో చూపించిన తీరు అద్భుతం. అదే క్రమంలో క్విట్ ఇండియా ఉద్యమంలో ఘంటసాల పాల్గొన్ని జైలు పాలు అయ్యే సన్నివేశాన్ని కూడా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తర్వాత మద్రాసులో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేస్తూ చనిపోయిన సన్నివేశంలో ఘంటసాల ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో భాగస్వాములు ఎలా అయ్యేరో కథలో మమేకం చేశారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక




కలిసిన పూర్వ విద్యార్థులు

- 32 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు
- గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో సందడి

గోపాలపట్నం: వారంతా 32 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. పదోతరగతి పూర్తయిన తర్వాత ఎవరి దారుల్లో వారు వెళ్లి పోయారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఆదివారం కలిశారు. దీంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ అపూర్వ కలయికకు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వేదికయింది. పాఠశాలలో 1990–91బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలిశారు. వీరంతా ఎక్కడెక్కడో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారలు చేస్తూ స్థిరపడ్డారు. వారి వారి యోగక్షేమాలు, ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోంగా గడిపారు. బెంచ్‌మీట్లు.. లంచ్ మీట్లు కలుసుకుని కుశల ప్రశ్నలు వేస్తూ సందడి చేశారు. ఆనాటి ఉపాధ్యాయులైన అప్పారావు, రాములు, లక్ష్మీనారాయణ, నిర్మల, ప్రేమ కుమారి, జీవన్‌లతలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల్ని ఆశీర్వదిస్తూ వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇలా కలవడం చాలా సంతోషంగా ఉందంటూ విద్యార్థులంతా ఉబ్బితబ్బిబయ్యారు. గ్రూప్ ఫోటోలు దిగారు. కార్యక్రమానికి నిర్వహించిన కె. కిషోర్, ఏవీ రాజు, రవి కిరణ్, పైడి రాజు, సూర్యనారాయణ లను సహచర స్నేహితులంతా అభినందించారు.

నాడు కళకళ.. నేడు వెలవెల



శిథిలావస్థకు చేరిన మీ సేవా భవనం



భవనం ప్రాంగణంలో పెరిగిన తుప్పలు

- శిథిలావస్థకు చేరిన మీ సేవ భవనం
- భయంకరంగా పరిసరాలు

మల్కాపురం: లక్షల వ్యయంతో జీవీఎంసీ నిర్మించిన భవనం నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. జనంతో కళకళలాడిన ఈ భవనం నేడు పిచ్చిమొక్కలు,తుప్పలతో భయంకరంగా మారింది. అదే జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని జీవీఎంసీ ఆస్పత్రి)కి ఆనుకుని 2013లో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రం. 500 గజాల్లో దీని ఏర్పాటు చేశారు. సింథియా నుంచి జింక్ వరకు ప్రజలు ఈ మీ సేవా కేంద్రానికి వచ్చి వివిధ దరఖాస్తులు చేసుకోవటం, సర్టిఫికెట్లు పొందడం,ఇతర సౌకర్యాలను పొందేవారు.అయితే మీ సేవా కేంద్రాలు మూతపడటంతో నాలుగేళ్ల నుంచి ఈ భవనానికి తాళాలు వేసి ఉంచేశారు. దీంతో భవనం శ్లాబ్ పెచ్చులు దూడి,గోడలు పగలి,రంగులు వెలసి,ఇనుప గేట్లు తుప్పుపట్టిపోయాయి. భవనం ప్రాంగణం మొత్తం పిచ్చి మొక్కలు పెరిగి పురాతన భవనం మాదిరిగా మారింది. విలువైన ఈ భవనం ఇలా వదిలేయడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలువైన భవనానికి మరమ్మతులు చేయించి ప్రజా అవసరాలకు వినియోగించాలని స్థానిక వాసులు కోరుతున్నారు.